

శైలపుత్రి రూపంలో అమ్మవారు

ధర్మపురి: ధర్మపురి శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు మొదటిరోజు శైలపుత్రి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు.



అశ్వవాహనంపై నృసింహుడు

ధర్మపురి: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని అశ్వవాహనంపై ఊరేగించారు. దారి పొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

గరిష్టం/కనిష్టం
31.0/24.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. సాయంత్రం, రాత్రి చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

హెల్త్‌కార్డుల్లో కుటుంబ వివరాలు నమోదు చేయాలి

- కలెక్టర్ సత్యప్రసాద్



డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలరూరల్: డిజిటల్ ఫ్యామిలీ హెల్త్ కార్డుల్లో కుటుంబ వివరాలు పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. గురువారం జగిత్యాలరూరల్ మండలం అంతర్గాం ఒడ్డెరకాలనీలో డిజిటల్ కార్డుల సర్వేను పరిశీలించారు. డిజిటల్ హెల్త్‌కార్డు సర్వేలో మొదటి గ్రామంగా ఒడ్డెరకాలనీని ఎంపిక చేయడంతో సర్వేలో కలెక్టర్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. కుటుంబ నిర్ధారణ నమోదు ప్రక్రియను వేగవంతంగా.. తప్పులు లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో మధుసూదన్, ఎంపీడీవో రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



వేంపేటలో ఓపెన్ జిమ్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లిరూరల్: కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు గురువారం భూమిపూజ చేశారు. రంగారావుపేటలో ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ, మేడిపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణం, వేంపేటలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. రాజ్యసభ ఎంపీ సురేశ్‌రెడ్డి నిధుల నుంచి ఈ పనులన్నీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, కార్యదర్శులు కళ్యాణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రులు



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం శరన్నవరాత్రోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. నృసింహస్వామికి, శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇక జిల్లా అభివృద్ధి సంస్థ

- పట్టణాభివృద్ధి సంస్థ తరహాలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ
- జిల్లా యూనిట్‌గా అభివృద్ధికి ప్రణాళిక
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు
- జిల్లాలో 382 గ్రామాలు.. ఐదు మున్సిపాలిటీలు
- ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు
- నామినేటెడ్ పద్ధతిలో చైర్‌పర్సన్ నియామకం
- వైస్ చైర్మన్‌గా కొనసాగనున్న కలెక్టర్



జగిత్యాల పట్టణ వ్యూ

జగిత్యాల: పట్టణ ప్రాంతాల్లో ఇదివరకే రూపుదిద్దుకున్న పట్టణాభివృద్ధి సంస్థ తరహాలో జిల్లా మొత్తం యూనిట్‌గా తీసుకుని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇంతకుపూర్వం జిల్లాకేంద్రం చుట్టూ ఉన్న మున్సిపాలిటీల్లో కొన్ని గ్రామాలను తీసుకుని అర్బన్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేసేవారు. ఆ మేరకు అభివృద్ధికి ప్రణాళిక రూపొందించేవారు. తాజాగా జిల్లా మొత్తం యూనిట్‌గా తీసుకుని కొత్తగా పట్టణాభివృద్ధి సంస్థ నెలకొల్పేలా ప్రణాళిక రూపొందించాలని డైరెక్టర్ ఆఫ్ మున్సిపాలిటీ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో పట్టణ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు ప్రణాళిక సిద్ధం చేసి గురువారం ఉన్నతస్థాయి అధికారులు పంపించారు.

పట్టణాభివృద్ధి సంస్థతో ప్రయోజనాలు

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటైతే దీనికోసం జిల్లాలో ప్రత్యేక కార్యాలయం రానుంది. ప్రభుత్వం ఓ చైర్‌పర్సన్‌ను నామినేటెడ్ పద్ధతిలో నియమించనుంది. కలెక్టర్ వైస్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం డీటీసీపీ సిబ్బందిని నియమిస్తారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి నిధులు వస్తాయి. అలాగే రూరల్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి నిధులు మంజూరై గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. గ్రామాల్లో డ్రెయినేజీలు, లైటింగ్ వ్యవస్థ, రహదారుల నిర్మాణాలు, సెంట్రల్ లైటింగ్, డివైడర్ల ఏర్పాటుకు నిధులు కేటాయిస్తుది. గ్రామాల్లో ప్రస్తుతం ఇంటి అనుమతులను పంచాయతీ నుంచి ఇస్తున్నారు. ఇందులో జీ ప్లస్ 2గానీ అంతకు మించి అంతస్తు నిర్మించుకోవాలన్నా ఇబ్బందికరంగా ఉండేది. ప్రస్తుతం ఈ సంస్థ ఏర్పాటైతే వీరే అన్ని పర్మిషన్లు ఇస్తారు. లేఅవుట్ల అనుమతి, పరిశ్రమల ఏర్పాటు ఉంటుంది. సంస్థ పరిధిలోకి గ్రామాలు వచ్చినా పంచాయతీ పాలన ఉంటుంది. ఆర్థికాభివృద్ధి ప్రణాళికలు, మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకే ఈ సంస్థ పనిచేస్తుంది.

జుడా ఏర్పాటు

జిల్లాకేంద్రంతోపాటు చుట్టూ ఉన్న మున్సిపాలిటీలు, అన్ని గ్రామాలను కలుపుకొని పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గతంలో జగిత్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (జుడా) కోసం ప్రణాళిక సిద్ధం చేశారు. చుట్టుపక్కల గ్రామాలు, మున్సిపాలిటీలు ఆ సంస్థ పరిధిలోకి వచ్చాయి. తాజాగా ఆ విధానాన్ని పక్కనబెట్టి జిల్లా మొత్తాన్నీ జుడా కిందకు తేవాలనే ఉద్దేశంతో ప్రణాళిక చేపట్టారు. ఈలెక్కన జిల్లాలోని 382 గ్రామపంచాయతీలు, ఐదు మున్సిపాలిటీలు ఈ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కిందకు రానున్నాయి.

ప్రతిపాదనలు పంపించాం

ఇటీవల జరిగిన సమావేశంలో జిల్లా మొత్తం పట్టణాభివృద్ధి సంస్థగా తీసుకోవాలని ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, 382 గ్రామాలను కలుపుకొని ప్రతిపాదనలు తయారుచేశాం. నివేదికను ప్రభుత్వానికి పంపించాం.

– శ్రీనివాస్, టీపీవో



కొలువుదీరిన అమ్మవారు

జగిత్యాలటౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాదేవి అమ్మవారిని మంటపాల్లో ప్రతిష్ఠించారు. జిల్లా కేంద్రంలోని యావర్‌రోడ్, పటేల్ చౌక్, ఎల్జీరాం లాడ్జ్, టవర్‌సర్కిల్, మోచీబజార్ శోభాయాత్ర చేపట్టారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. చిన్నారుల వేషధారణలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. భవాని దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.



నేడు రైతుల చలో కలెక్టరేట్




వెల్దుర్తిలో మాట్లాడుతున్న రైతు ఐక్యవేదిక నాయకులు

జగిత్యాలఅగ్రికల్చర్: రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయం తెల్సిందే. రైతులందరికీ బేషరతుగా రూ.2లక్షల వరకు పంట రుణమాఫీ చేయాలని, రైతుబీమా, రైతు భరోసా అందించాలని, దొడ్డు ధాన్యానికి కూడా బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం రైతు ఐక్య వేదిక నాయకులు గత పదిహేను రోజులుగా గ్రామం గ్రామం తిరుగుతూ, రైతులను ఐక్యం చేస్తున్నారు. ప్రతి గ్రామం నుంచి కనీసం 100మంది రైతులు జిల్లా కేంద్రానికి వచ్చేలా రైతు ఐక్యవేదిక నాయకులు ప్రయత్నిస్తున్నారు. ముందుగా కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి.. ఆందోళన చేపట్టనున్నట్లు రైతు ఐక్యవేదిక నాయకులు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులను ఆందోళనకు రావాలని కోరారు.

విద్యార్థికి 'అపార్'మైన ప్రయోజనాలు

- అన్నింటికి అదే నంబర్
- జారీకి అధికారుల కసరత్తు
- వివరాల సేకరణలో నిమగ్నం

కరీంనగర్: అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ).. దేశంలో ప్రతీ విద్యార్థికి అందించే గుర్తింపు నంబరు. జాతీయస్థాయిలో ప్రతీ విద్యార్థికి ఒక్కో నంబరు కేటాయించి.. తదనుగుణంగా వారి సర్వ సమాచారాన్ని నిక్షిప్తం చేస్తారు. 'వన్ నేషన్ వన్ స్టూడెంట్' నినాదంలో భాగంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కొత్త అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. జాతీయ నూతన విద్యావిధానం -2020 అమలులో భాగంగా ఈ దిశగా అడుగేసింది. కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు కేటాయించనుండగా.. కార్యాచరణ మొదలు కానుంది. ఈ మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. వివిధ దశల్లో సర్కారు బడుల నిర్వాహకులకు అధికారులు అవగాహన కల్పించనున్నారు.



గుర్తింపు కార్డు ప్రత్యేకతలు

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, జెండర్, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు డిజిటల్ కార్డులో ఉంటాయి. అకాడమీ సమాచారం, విద్యార్థి విజయాలు ఎప్పటికప్పుడు నమోదవుతాయి. అకాడమీ పరంగా జీవితకాల గుర్తింపు కార్డుగా పరిగణిస్తారు. విద్యార్థి సంబంధిత సర్వ సమాచారం సమీకృతంగా ఒకే చోట లభిస్తుంది. ఆన్‌లైన్‌లో నంబరు నమోదు లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేస్తే సమాచారం తెలుసుకోవచ్చు. అన్ని రకాల యాజమాన్యాల విద్యార్థులకు ఇది అవశ్యం.

పొందే విధానం..

పాఠశాలకు విద్యార్థితో పాటు తల్లి లేదా తండ్రి కచ్చితంగా వెళ్లాల్సిందే. తొలుత యూడైస్‌లో నమోదైన వివరాలు సరి చూసుకోవాలి. అనంతరం ఆన్‌లైన్‌లో 'అపార్' కార్డుకు దరఖాస్తు చేయాలి. హెచ్‌ఎం ధ్రువీకరణ అవశ్యం. ఆయన అంగీకారంతో యూడైస్-వెబ్‌సైట్ వేదికగా ప్రక్రియ చేపడతారు. విద్యార్థి ఆధార్ అనుసంధానమైన చరవాణి నంబరుకు ఓటీపీ వస్తుంది. అనంతరం గుర్తింపు నంబరు జారీ అవుతుంది. ఆన్‌లైన్‌లో కార్డు ఒకసారి వెలువడితే.. సవరణకు అవకాశం ఉండబోదు.

నిర్వాహకుల బాధ్యత

అపార్ ప్రాధాన్యంపై తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సి ఉంది. యూడైస్ వెబ్‌సైట్‌లో విద్యార్థికి 'పెన్' (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబరు) ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఆధార్ చెల్లుబాటు (వ్యాలిడేట్) అయి ఉండేలా ప్రేరణ కల్పించాలి.

అధికారులు ఏం చేస్తున్నారు

ఈ కొత్త విధానంపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే జిల్లాల్లో సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రాథమిక విద్య మొదలు ఇంటర్ వరకు 'అపార్' గుర్తింపు నంబరు జారీ దిశగా జిల్లా విద్యా శాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు.

ప్రయోజనాలు

గుర్తింపు కార్డు.. విద్యార్థి బ్యాంకు ఖాతా (అకాడమీ), డీజీ లాకర్ అనుసంధానమై ఉంటుంది. క్రెడిట్స్ (మార్కులు)ను బదలాయించవచ్చు. వివిధ విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు, ధ్రువీకరణ సులువుగా పూర్తవుతుంది. ఉపకార వేతనాలు, ఉద్యోగాల భర్తీ సమయం, ఇతర సందర్భాల్లో కీలకం కానుంది. భవిష్యత్‌లో ఈ సమాచారం ప్రామాణికంగా భావించనున్నారు.

రాయికల్ మాస్టర్‌ప్లాన్‌పై సమీక్ష

- ఆయోదయోగ్యంగా ఉండాలన్న ఎమ్మెల్సీ



కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్: రాయికల్ పట్టణ ప్రజలు మాస్టర్ ప్లాన్‌తో ఇబ్బంది పడుతున్నారని, అందరికీ ఆయోదయోగ్యంగా ఉండేలా చూడాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం బల్దియా కార్యాలయంలో మాస్టర్ ప్లాన్‌పై కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌తో ఆయన సమీక్షించారు. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ప్రజలు ఇళ్లు నిర్మించుకోలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జోన్ల ప్రక్రియపై పూర్తి నివేదిక తనకు అందిస్తే సంబంధిత అధికారులు, మంత్రి, సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, కౌన్సిలర్ మ్యాకల అనురాధ, హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్, పట్టణ నాయకులు మహిపాల్‌రెడ్డి, బాపురపు నర్సయ్య, దివాకర్‌రెడ్డి, ఇంతియాజ్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ




లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: జగిత్యాల పట్టణం, అర్బన్, రూరల్ మండలాలకు చెందిన 149 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ కింద మంజూరైన రూ.1,49,17,000తోపాటు 97 మందికి సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.30 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ గురువారం పంపిణీ చేశారు. జగిత్యాలలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు రాష్ట్రానికే తలమానికమన్నారు. ఇళ్ల వద్ద మౌలిక వసతులకు రూ.14కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. ఆలయాల్లో భజన మందిరం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, తహసీల్దార్లు రాంమోహన్, శ్రీనివాస్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు 'జువ్వాడి' విగ్రహావిష్కరణ

- హాజరుకానున్న మంత్రులు
- కోరుట్ల వెటర్నరీ కళాశాల వేదిక



జువ్వాడి కాంస్య విగ్రహం నమూనా

కోరుట్ల: దివంగత వైఎస్సార్ హయాంలో దేవాదాయ శాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రార్ శాఖల మంత్రిగా అందరి మన్ననలు పొందిన కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి రత్నాకర్‌రావు కాంస్య విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించనున్నారు. దీనికి కోరుట్లలోని వెటర్నరీ కళాశాల వేదిక కానుంది. కార్యక్రమానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, నాయకులు కృష్ణారావు కోరారు.

సాయుధ పోరాటం నుంచి..

రత్నాకర్‌రావు స్వగ్రామం ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్. తెలంగాణ సాయుధ పోరాటం సందర్భంగా రైతులు, ప్రజల పక్షాన పోరాటం చేసి జైలు జీవితం గడిపారు. రాజకీయాల్లో చేరి 12ఏళ్లు తిమ్మాపూర్ సర్పంచ్‌గా పనిచేశారు. 1981లో జగిత్యాల బ్లాక్ ప్రెసిడెంట్‌గా గెలిచారు. 1983లో కాంగ్రెస్ తరఫున జగిత్యాల అసెంబ్లీకి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 1989 స్వతంత్ర అభ్యర్థిగా, 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా బుగ్గారం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004లో గెలిచిన ఆయన వైఎస్సార్ ప్రభుత్వంలో దేవాదాయ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా పనిచేశారు. వైఎస్సార్‌తో ఉన్న సాన్నిహిత్యంతో కోరుట్లలో వెటర్నరీ కళాశాల ఏర్పాటు చేయించారు. అలాగే పాలిటెక్నిక్, సబ్ రిజిస్ట్రార్, ఎంవీఐ కార్యాలయాలను అందుబాటులోకి తెచ్చారు. టీటీడీ బోర్డు మెంబర్‌గా టీటీడీ కల్యాణ మండపం ఏర్పాటు చేయించారు. 2020 మే 10న కన్నుమూశారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జువ్వాడి నర్సింగరావు, నాయకులు

క్లుప్తంగా

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్త అరెస్ట్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఎలకబావి వాడ ప్రాంతానికి చెందిన రాపల్లి సౌమ్య ఆత్మహత్యకు కారకుడైన ఆమె భర్త రాపల్లి రాజేశ్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల ఒకటిన ఎలుకబావి వాడ ప్రాంతానికి చెందిన సౌమ్య ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెల్సిందే. ఆమె తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేశామని, గురువారం రాజేశ్‌ను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు.

మల్లేశం కోసం గాలింపు

కథలాపూర్: వరదకాలువలో గల్లంతైన మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన నేతుల మల్లేశం ఆచూకీ కోసం పోలీసులు గురువారం గాలింపు చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వరద కాలువ వెళ్లే మండలంలోని దుంపేట, దూలూర్, బొమ్మెన, దమ్మన్నపేట, మల్యాల మండలం రాంపూర్ వరకు ఎస్సై నవీన్‌కుమార్, పోలీస్ సిబ్బంది గాలించారు. గజ ఈతగాళ్లు వరదకాలువలో తెప్పపై వెళ్లి గాలించారు. అయినా మల్లేశం ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు.

బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు జగిత్యాల విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులు

జగిత్యాల: బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు జగిత్యాలకు చెందిన దుగ్యాల రాఘవ్, సాకేత్, వరుణ్, అమాన్‌పాషా, సాయిమణి, స్వరాలి, మాన్సి, హన్సిక, శివ, తేజస్విని, జైద్ ఎంపికయ్యారని బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్ తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆలయంలో చోరీ

- వేలిముద్రలు సేకరించిన పోలీసులు


దొంగలు పగులగొట్టిన దేవాలయ గేటు

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలం బాలపల్లిలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు గుడి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఉత్సవ విగ్రహానికి ఉన్న కిలో నాగభరణం, అరతులం బంగారు చైను, అరతులం బంగారు పుస్తెలు చోరీకి గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించి నిందితుల కోసం గాలిస్తున్నారు.

కొండగట్టులో దుర్గాదేవికి పూజలు


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఒకరిపై నలుగురి దాడి


గాయపడిన రాజేందర్

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లులకు చెందిన కోయల్కర్ రాజేందర్‌పై నలుగురు వ్యక్తులు గురువారం రాత్రి దాడికి పాల్పడ్డారు. ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఉన్న రాజేందర్‌పై రెండు ద్విచక్రవాహనాలపై వచ్చిన నలుగురు ఒక్కసారిగా కర్రలతో దాడి చేశారు. తనకు బావమరిది వరసైన వ్యక్తే ముగ్గురితో కలిసి వచ్చి దాడి చేశాడని అనుమానిస్తూ రాజేందర్ మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కొద్దిరోజుల క్రితం ఫోన్ చేసి ఒక్కడివే రావాలని అనడంతో తాను ఆ ప్రాంతానికి వెళ్లానని, దీంతో కర్రతో దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆస్ట్రేలియా వీసాల పేరుతో భారీమోసం

- అక్కడి పొలాల్లో తాత్కాలిక ఉద్యోగాలంటూ ప్రచారం
- పది, ఇంటర్ చదివిన వారే టార్గెట్
- రూ.2 లక్షల వరకు వేతనమంటూ ఎర
- మెడికల్ టెస్టులకు అభ్యర్థుల నుంచి రూ.12,500 వసూళ్లు
- ఉమ్మడి కరీంనగర్, ఏపీ, తెలంగాణలో 4వేల మంది వద్ద రూ.5 కోట్లతో పరార్
- ఉద్యోగుల డేటాతో కొత్త కంపెనీలు రిజిస్ట్రేషన్, తిరిగి మోసాలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్: 'మీరు పదో తరగతి, ఇంటర్‌తోనే చదువు ఆపేశారా? అయినా మీ విదేశీ కలను నెరవేర్చుకోవచ్చు. ఆస్ట్రేలియాలో స్వల్పకాలిక వీసాలపై నెలకు రూ.2 లక్షలు సంపాదించుకునే అవకాశం త్వరపడండి'.. అంటూ వేలాది మంది వద్ద డబ్బు వసూలు చేసిన ఓ కంపెనీ బోర్డు తిప్పేసింది. హైదరాబాద్, వైజాగ్ కేంద్రంగా సాగిన ఈ కుంభకోణం కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వరకు విస్తరించి, ఆపై బిచాణా ఎత్తేసింది. అమాయక యువత నుంచి రూ.కోట్లు కొల్లగొట్టి చల్లగా జారుకున్న సంస్థ బాగోతమిదీ.

అసలేం జరిగింది

'గ్రోయింగ్ గ్లోబల్ ఇమిగ్రేషన్' పేరుతో ఓ సంస్థ 2020లో అంటే కరోనా తర్వాత హైదరాబాద్ అమీర్‌పేటలో వెలిసింది. ఇది తిలక్‌రాజ్ శర్మ పేరుతో రిజిష్టర్ అయింది. ఇతనికి విజయ్‌రామ్ అనే వ్యక్తి తోడుగా ఉండేవాడు. ఇద్దరూ ఉత్తరప్రదేశ్‌కు చెందినవారు. పది, ఇంటర్ చదివినా.. రూ.లక్షల్లో వేతనాలు ఉంటాయని, ఆస్ట్రేలియా వీసా ఇట్టే ఇప్పిస్తామని సంస్థ ప్రచారం చేసుకుంది. అమీర్‌పేటతోపాటు గ్రేటర్ హైదరాబాద్‌లో కరపత్రాలు పంచింది. ఈ ప్రకటనలు చూసిన పలువురు పది, ఇంటర్ చదివిన అమాయక యువత ఆకర్షితులయ్యారు. అమీర్‌పేటలో వారి విద్యార్హతలు, పాస్‌పోర్టులు చూసి ఇంటర్వ్యూలు నిర్వహించారు.



ఢిల్లీలో పరీక్షలు నిర్వహించిన శ్యామ్ ల్యాబ్

ఇలాంటిదే మరో శాఖ విశాఖపట్నంలోనూ ఏర్పాటు చేసి ఇదే పద్ధతిలో ఉత్తరాంధ్ర అభ్యర్థులను ఆకర్షించారు. అదే సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడులోనూ తమ కార్యకలాపాలు విస్తరించారు. వీరికి ఆస్ట్రేలియాలోని పలు పండ్లతోటల్లో రూ.2 లక్షల వేతనంతో ఉద్యోగాలు ఇస్తామన్నారు. తమకు అక్కడికి వెళ్లాక వారివేతనం నుంచి కొంత కమీషన్ కింద చెల్లించాలని సూచించారు.

ఢిల్లీలో పరీక్షల కోసం వసూళ్లు

వీరందరినీ పలు విడతల్లో ఢిల్లీలో వైద్యపరీక్షల కోసం పంపారు. అక్కడ ఈస్ట్ పంజాబ్ బాగ్‌లోని శ్యామ్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లో ఫిట్‌నెస్ కోసం పలు రకాల పరీక్షలు నిర్వహించారు. ఇందుకోసం ప్రతీ అభ్యర్థి వద్ద రూ.12,500 వసూలు చేశారు. అందరి వద్ద నగదే తీసుకున్నారు. ఫోన్‌పే, గూగుల్ పే అంగీకరించలేదు. ఇలా చెల్లించినవారిలో కేవలం తెలంగాణ, ఏపీకి చెందిన వారే 4,000 మందికిపైగా ఉన్నారు. అంటే తెలుగువారి నుంచే దాదాపు రూ.5 కోట్లకుపైగా నగదు వసూలు చేశారు. కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్ ఇతర రాష్ట్రాల నుంచి ఇంతకు రెట్టింపు సంఖ్యలో వసూలు చేశారని తెలుగు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. అయితే, 2020 నుంచి 2023 వరకు ఈ తతంగం సాఫీగానే సాగింది. అందరికీ ఒకేసారి వీసాలు వస్తాయని మభ్యపెడుతూ వచ్చారు. తీరా 2023 ఆరంభంలో కంపెనీ ప్రతినిధులు అంతా అదృశ్యమయ్యారు. అభ్యర్థులు ఉన్నత విద్యావంతులు కాకపోవడం, చిన్న మొత్తం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేయరన్న ధీమాతో మోసం చేశారని బాధితులు వాపోతున్నారు.

ఎలా బయటికి వచ్చింది..?

అందరిలాగే కరపత్రాలు చూసి పెద్దపల్లి జిల్లాకు చెందిన శశిధర్ అనే యువకుడు అమీర్‌పేటలోని వీరి ఆఫీసుకు వెళ్లాడు. చురుగ్గా ఉన్నావని, నీకు శాశ్వత వీసా ఇస్తామని అదే కంపెనీలో నెలకు రూ.30వేల వేతనంతో ఉద్యోగమిచ్చారు. ఉన్నఫలంగా కంపెనీ కార్యకలాపాలు నిలిచిపోవడంతో శశి ఢిల్లీలో వారిని నిలదీశాడు. అక్కడ వారు ఎక్కువ మాట్లాడితే చంపుతామని బెదిరించి పంపారు. తాను మోసపోయానని, తెలివిగా ఈ స్కాంలో ఇరికించారని అర్థం చేసుకుని బాధితుడు ఇంటిముఖం పట్టాడు. ఇటీవల తన పేరుతో మరో కంపెనీని ప్రారంభించారని తెలుసుకుని అవాక్కయ్యాడు. అతనితోపాటు, తమ కంపెనీకి దేశవ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న వేలాదిమంది విద్యార్హతలు, ఆధార్, ఇతర వివరాలు కంపెనీ వద్ద ఉన్నాయి. వాటితో మరిన్ని కంపెనీలు ఏర్పాటు చేసి తనలాగే ఇరికిస్తారన్న ఆందోళనతో 'సాక్షి'ని ఆశ్రయించాడు.

నమ్మించి మోసం చేశారు



ఆస్ట్రేలియాలో ఉద్యోగాలు అంటే నమ్మాం. మమ్మల్ని దారుణంగా మోసం చేశారు. ఎన్నో ఆశలతో ఢిల్లీకి వెళ్లాం. అక్కడ వారు అడిగినంత చెల్లించాం. రెండేళ్లుగా ఎదురు చూస్తున్నాం. కంపెనీ వారు మోసం చేశారని తెలుసుకుని బాధపడుతున్నాం. నిందితుల నుంచి మా డబ్బు వెనక్కి ఇప్పించాలి. – సురేశ్, విశాఖపట్నం, ఏపీ

చంపుతామన్నారు



నా తెలివితేటలు చూసి ఉద్యోగం ఇచ్చారనుకున్నా. శాశ్వత వీసా మీద పంపిస్తామంటే నమ్మాను. తెలివిగా నన్ను ఇరికించారు. విషయం తెలుసుకుని వారిని నిలదీస్తే చంపుతామని బెదిరించారు. ఎలాగోలా ఢిల్లీ నుంచి వచ్చేశాను. కానీ, నా పేరు మీద 'ఎక్స్‌పోగ్లో గ్లోబల్ కన్సల్టెంట్స్ ప్రై.లి' పేరుతో కంపెనీ పెట్టారు. ఆ కంపెనీలో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలకు చెందిన బాధితుల డేటా ఉంది. – శశిధర్, పెద్దపల్లి, తెలంగాణ

పైసా వసూల్..

- ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్, విత్తనాల కంపెనీల నుంచి మాముళ్లు
- జిల్లా వ్యవసాయశాఖలో ఓ అధికారి తీరు
- మంత్రికి ఫిర్యాదు చేసిన విప్

కోరుట్ల: అదను దొరికితే కాసుల వసూళ్లు.. ఇదీ జిల్లా వ్యవసాయ శాఖలో ఓ అధికారి తీరు. ఫర్టిలైజర్ షాపులు, పీఏసీఎస్‌లు, విత్తనాల దుకాణాలు.. ఇలా ఎక్కడపడితే అక్కడ వసూళ్లకు పాల్పడుతున్న సదరు అధికారిపై వరుస ఆరోపణలు రావడం గమనార్హం. రెండ్రోజుల క్రితం కిందిస్థాయి వ్యవసాయాధికారులు కొందరు విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. వీరిరువురు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి విషయం తీసుకెళ్లినట్లు సమాచారం.

కలెక్టర్‌కు ఫిర్యాదు

జిల్లాలోని పీఏసీఎస్‌లు, ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపుల హోల్‌సేల్ డీలర్ల నుంచి తీసుకోవాల్సిన ఓ ఫాంలు సకాలంలో తీసుకోవడం లేదన్న సాకుతో సదరు వ్యవసాయ అధికారి వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. పెస్టిసైడ్ షాపులకు ప్రిన్సిపాల్ సర్టిఫికెట్ల (పీసీ)లు లేవన్న కారణంతో మామూళ్లకు తెరలేపుతున్నట్లు ఆరోపణలున్నాయి. జిల్లాలోని ఓ పీఏసీఎస్ అధ్యక్షుడు సదరు వ్యవసాయాధికారికి రూ.10వేలు ఇచ్చినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం గమనార్హం. వ్యవసాధికారులు ప్రిస్క్రిప్షన్ లేకుండా నేరుగా రైతులు పెస్టిసైడ్స్, విత్తనాలు ఎలా కొనుగోలు చేస్తున్నారని కొందరు ఏవోలను ఇబ్బంది గురిచేసినట్లు సమాచారం. ఏవోలు వివిధ గ్రామాల్లో 15 సర్వేనంబర్ల వారీగా పంటల వివరాలతో ఫొటోలో దిగి పంపాలని ఒత్తిడి చేయడం, లేదంటే మెమోలు జారీచేయడం కిందిస్థాయి అధికారుల్లో కలవరం రేపింది. ఏటా ఫర్టిలైజర్, పెస్టిసైడ్, విత్తనాలు కంపెనీలు నుంచి మాముళ్ల వసూలు చేయడం షరామామూలుగా మారిందని వ్యాపారవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మంత్రి దృష్టికి..

వ్యవసాయాధికారి తీరుపై గురువారం జిల్లాకు చెందిన ఏవోలు కొందరు విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇప్పటికే సదరు అధికారిపై కొన్ని ఫిర్యాదులుండగా విప్, ఎమ్మెల్సీలు ఈ విషయాన్ని ఫోన్ ద్వారా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో జిల్లా వ్యవసాయశాఖలో చర్చనీయాంశంగా మారింది.

కాపర్ వైర్ దొంగల ముఠా అరెస్ట్

సుల్తానాబాద్‌రూరల్: కాపర్ వైర్లు చోరీ చేస్తున్న ముఠాను గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. పట్టణంలోని శాస్త్రీనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ కేంద్రంలో ఈ నెల 23న కాపర్‌వైర్ చోరీ జరుగగా బాధితుడు నరేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితులు మళ్లీ సుల్తానాబాద్‌లో చోరీ చేసేందుకు గురువారం రాగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. మంచిర్యాల జిల్లాకు చెందిన భూమయ్య, రాములు(పరారీలో ఉన్నాడు), సురేందర్(9 కేసులు), శంకరయ్య (7 కేసులు), గోషిక కార్తీక్, కడమండ శ్రీకాంత్, శ్రీనివాస్ ముఠాగా ఏర్పడి కాపర్ వైర్ చోరీ చేయగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారు. నిందితుల నుంచి రూ.2లక్షల విలువ గల కాపర్‌వైర్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్, ఏఎస్సై తిరుపతి, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, కానిస్టేబుల్ రమేశ్, రాజ్, ఇమ్రాజ్‌కు రివార్డు ఇవ్వడంతో పాటు అభినందించారు.

మంత్రి సురేఖ వ్యాఖ్యలు సరికాదు

- మహిళా మంత్రులను అడ్డుపెట్టుకుని బీఆర్‌ఎస్‌పై సీఎం దాడి
- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత


మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల: మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు ఆడజన్మకే కళంకమని, మహిళా మంత్రులను అడ్డుపెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌పై దాడి చేస్తున్నారని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మహిళలకు ఇష్టమైన ఎంగిలిపూల బతుకమ్మ రోజే సురేఖ మతితప్పి మాట్లాడటం సరికాదని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వైఫల్యాలను డైవర్ట్ చేసేందుకు మహిళామంత్రులను శిఖండిలా పెట్టుకుని రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. హైడ్రా పేరుతో సీఎం పేదల ఇళ్లను కూల్చుతున్నారని, ప్రజలంతా బీఆర్‌ఎస్ నాయకుల వద్దకు వచ్చి గోడు వెళ్లబోసుకుంటున్నారని, దానిని చూసి ఓర్వలేక కేటీఆర్‌పై సురేఖ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్‌పర్సన్ శీలం ప్రియాంక, ఉదయశ్రీ పాల్గొన్నారు.

ఈద్గా భూములపై పకడ్బందీ సర్వే


ఇరువర్గాలతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

మెట్‌పల్లి: పట్టణంలోని వెంకట్రావుపేట శివారులోని ఈద్గా స్థలానికి పకడ్బందీగా సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేస్తామని మెట్‌పల్లి ఆర్డీఓ శ్రీనివాస్ తెలిపారు. ఈద్గా స్థలం హద్దులపై ఇటీవల వివాదం ఏర్పడింది. దీంతో గురువారం డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డితో కలిసి ఆర్డీఓ ఈద్గాను పరిశీలించారు. వివాదానికి గల కారణాలపై అక్కడ ముస్లింలతోపాటు స్థానికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈద్గా భూముల విషయంలో ఆందోళన చెందవద్దని, సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి


సాతారంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన నరేశ్

మల్లాపూర్: అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ అన్నారు. మండలంలోని గుండంపల్లి, సాతారంలో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. మెట్‌పల్లి సీడీపీవో మణెమ్మ మండలంలోని పాతదాంరాజుపల్లి, వాల్గొండలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిపై గొడ్డలితో దాడి


గాయపడిన ఫయిమ్

కోరుట్ల: గుర్తుతెలియని దుండగులు ఓ యువకుడిపై గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. ఈ సంఘటన గురువారం రాత్రి 11గంటలకు కోరుట్ల పట్టణంలోని కాలువ గడ్డ వద్ద జరిగింది. వివరాలు.. పట్టణానికి చెందిన ఫయిమ్ అనే యువకుడిపై గుర్తుతెలియని వ్యక్తి గొడ్డలితో దాడి చేయడంతో అతడి భుజానికి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు మొదట కోరుట్లలోని ప్రభుత్వాసుపత్రికి ఫయిమ్‌ను తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఇప్పటి వరకు ఫిర్యాదు చేయలేదని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

మెట్‌పల్లి ఆస్పత్రిలో నిలిచిన ప్రసవాలు



మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో గురువారం గర్భిణులకు ప్రసవ సేవలను నిలిపివేశారు. 13 మంది గర్భిణులు ఆస్పత్రిలో చేరగా, వీరిలో కొందరికి సాయంత్రం డెలివరీ చేయడానికి వైద్య సిబ్బంది ఏర్పాట్లు చేశారు. అదే సమయంలో ఆపరేషన్ థియేటర్‌లోని ఏసీ పని చేయలేదు. దీంతో వెంటనే చికిత్స చేయడం నిలిపివేశారు. ఏసీకి మరమ్మతులు చేయకపోవడంతో శుక్రవారం డెలివరీలు చేస్తామని అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది 'సాక్షి'కి తెలిపారు. దీంతో గర్భిణుల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

చెర్లకొండాపూర్‌లో ఫ్లోరైడ్ భూతం..?

- రోగాల బారిన పడుతున్న గ్రామస్తులు
- పసుపురంగులో ప్రజల పళ్లు
- మోకాళ్ల నొప్పులతో ఇబ్బందులు
- వాటర్ ప్లాంట్‌తో సమస్య పరిష్కారం


కీళ్ల నొప్పులు, పంటి సమస్యలతో బాధపడుతున్న గ్రామస్తులు


తెలుపురంగులోకి మారిన వంటపాత్ర

రాయికల్(జగిత్యాల): ఫ్లోరైడ్ సమస్య అనగానే ముందుగా గుర్తుకొచ్చేది నల్గొండ జిల్లా.. కానీ జగిత్యాల జిల్లాలోని రాయికల్ మున్సిపాలిటీకి కూతవేటు దూరంలో ఉన్న చెర్లకొండాపూర్ గ్రామస్తులు దశాబ్దాల కాలంగా ఫ్లోరైడ్ సమస్యతోనే బాధపడుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఈ విషయం వెలుగుచూడడం లేదన్న అపవాదు ఉంది. గ్రామంలోని ప్రతిఒక్కరి దంతాలు (పళ్లు) పసుపు రంగులోకి మారిపోవడం.. కీళ్ల నొప్పులతో బాధపడుతుండడంతో ఫ్లోరైడ్ సమస్యే అని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో 1158 మంది జనాభా, 795 మంది ఓటర్లు ఉన్నారు. వీరు తాగే నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో ఫ్లోరైడ్ సమస్య ఉందన్న విషయం అధికారులకు తెలియదా..? లేదా తెలిసినా పట్టించుకోవడం లేదా..? ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నారా..? అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు నాలుగు చేతిపంపులు, వాటర్‌ట్యాంక్‌లు ఉన్నప్పటికీ నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండటంతో సమస్య తీవ్రం అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రైవేటు వాటర్ ప్లాంట్ల నుంచి నీటిని కొనుక్కోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి గ్రామంలోని నీటి వనరులను పరీక్షలు చేస్తే సమస్య ఏంటో వెలుగుచూస్తుందని చెబుతున్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్పందించి ఫ్లోరైడ్ సమస్య లేకుండా చూడాలని, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో మాట్లాడి వాటర్ ప్లాంట్లను మంజూరు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పళ్లు పసుపురంగులోకి..



గ్రామంలోని నీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండటంతోనే ప్రతిఒక్కరి దంతాలు పసుపు రంగులోకి మారుతున్నాయని అనుకుంటున్నాం. గ్రామస్తులందరం కీళ్లనొప్పులతో బాధపడుతున్నాం. ఎముకలు బలహీనపడుతున్నాయి. ఈ సమస్యలన్నీ చూస్తే ఫ్లోరైడే కారణమన్న అనుమానం కలుగుతోంది. – ఆకుల రాజేందర్, గ్రామస్తుడు

ఊరంటేనే భయపడుతున్నారు



మా ఊరిలోని నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉందని మండలంలోని చాలా గ్రామాలకు తెలిసింది. మా ఊరికి వచ్చి నీటిని తాగాలంటేనే భయపడుతున్నారు. నీటిని తాగడం ద్వారా ఈ సమస్య ఎక్కువ అవుతుంది. అయినా మా బాధను ఇప్పటివరకు ఎవరూ పట్టించుకున్న పాపన పోవడం లేదు. – రమేశ్, గ్రామస్తుడు

వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి



గ్రామంలో లభించే నీరు ఉప్పుగా ఉంటోంది. ఎన్నో ఏళ్ల నుంచి ఈ సమస్యతో బాధపడుతున్నాం. స్వచ్ఛంద సంస్థ సభ్యులు సహకరించి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే కొంతవరకైనా మా సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది. – రాజలక్ష్మీ, మాజీ సర్పంచ్

పరీక్షలు నిర్వహిస్తాం



చెర్లకొండాపూర్ గ్రామంలో చాలామంది పళ్లు పసుపు రంగులోకి మారాయని, కీళ్లనొప్పులతో బాధపడుతున్నారని మా దృష్టికి వచ్చింది. గ్రామంలో మెడికల్ క్యాంపులు నిర్వహించి పరీక్షలు నిర్వహిస్తాం. నీటిలో లవణాల శాతం ఎంత ఉందో పరీక్షిస్తేనే తెలుస్తుంది. అప్పటివరకు మినరల్ వాటర్ తాగాలి. – శ్రీనివాస్, డెప్యూటీ డీఎంహెచ్

గుండెపోటుతో ఇద్దరి మృతి

- ఒకరు ప్రధానోపాధ్యాయుడు
- మరొకరు సబ్‌స్టేషన్ ఆపరేటర్


రవిబాబు(ఫైల్)


సతీశ్ (ఫైల్)

మెట్‌పల్లిరూరల్/జగిత్యాలరూరల్: గుండెపోటుతో మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోగుల రవిబాబు (51), జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి సబ్‌స్టేషన్ ఆపరేటర్ సతీశ్ గురువారం మృతిచెందారు. రవిబాబుకు స్వగ్రామమైన నిజామాబాద్ జిల్లా మామిడిపల్లిలోని ఇంటి వద్దనే గుండెపోటుతో రావడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. మెట్‌పల్లి పట్టణంలోని డీడీనగర్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించిన ఆయన.. ఇటీవలే జగ్గాసాగర్ బదిలీ అయ్యారు. రవిబాబు ఆకస్మిక మృతి పట్ల ఉపాధ్యాయవర్గాలు ప్రగాఢ సంతాపం తెలిపాయి. అలాగే తాటిపల్లి సబ్‌స్టేషన్ ఆపరేటర్ సతీశ్‌కు గుండెపోటు వచ్చి అక్కడికక్కడే మృతిచెందాడు. జగిత్యాల ఏడీ జవహర్‌లాల్ నాయక్, ఏఈ శ్రీధర్ ధర్మపురిలో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్ట్

- డీఎస్పీ రఘుచందర్ వెల్లడి


నిందితుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన నన్నపునేని విద్యాసాగర్‌ను హత్య చేసిన అతని సోదరుడు నన్నపునేని విక్రమ్‌రాజ్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నిందితుడి అరెస్ట్‌ను చూపారు. విద్యాసాగర్‌కు అతని సోదరుడు విక్రమ్‌రాజ్ మధ్య కొద్దికాలంగా భూమి తగాదాలున్నాయని, వాటిని మనసులో పెట్టుకుని విక్రమ్‌రాజు రోకలిబండతో సోదరుని తలపై బాది హత్య చేశాడని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ వై.కృష్ణారెడ్డి, ఎస్సై సదాకర్ పాల్గొన్నారు.